



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా



'ఇందిరమ్మ'.. ఇంకెప్పుడు?

- జిల్లాలో రెండో విడత కింద 6,907 ఇళ్ల మంజూరు
- ఆదిలాబాద్ ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా 500ల ఇందిరమ్మ ఇళ్లు
- ప్రొసిడింగ్‌ల కోసం లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు
- ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్ కాలం
- ఆలస్యం చేస్తే అంతేసంగతి!!

ఆదిలాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు జిల్లాలో ఆలస్యమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే తొలి విడతలో ప్రభుత్వం జిల్లాకు 2,148 ఇళ్లను మంజూరు చేసింది. అలాగే 17 మండలాల్లో ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణాలు దాదాపుగా చివరిదశకు చేరుకుం టున్నాయి. మళ్లీ రెండవ విడత కింద ప్రభుత్వం 6,907 ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే వెరిఫికేషన్ పూర్తికావడంతో లబ్ధిదారుల ఫైనల్ జాబితాకు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ఆ మోదం తెలిపారు. దీంతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాలలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జాబితాను అధికారులు విడుదల చేశారు. దీంతో సొంతింటి నిర్మాణం కోసం లబ్ధిదారులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే మొదటి విడతలో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్న అర్బన్ ప్రాంతంలో మాత్రం లబ్ధిదారుల ఎంపికపై భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు చేపట్టిన వెరిఫికేషన్ తప్పుల తడకగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఫలించిన ఎమ్మెల్యే ప్రయత్నం

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అధికార పార్టీకి చెందిన వారికే ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇందిరమ్మ కమిటీల్లోను వారికే అవకాశం ఇవ్వడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కొంత ఇబ్బందికర పరిస్థితి ఎదురయ్యింది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పట్టుబట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తుంది. తమ అనుచరులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కకుండా అధికార పార్టీ నేతలు అడ్డుపడుతున్నారంటూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే పాయల శంకర్‌కు ప్రత్యేకంగా మరో 500ల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే అధికారికంగా ఆదేశాలు ఇవ్వడంతో అర్హులైన వారిని గుర్తించి జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లోనే ఎమ్మెల్యే అందించే జాబితా ఆధారంగా క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని జిల్లా కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే మరో 500ల ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కేటాయించడంపై కాంగ్రెస్ వర్గాలు భగ్గుమంటున్నాయి.



మావల మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌజ్

ఖరారు కాని ముహూర్తం

రెండవ విడత కింద ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. కానీ లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లు అందించక పోవడంతో ఇంటి నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయి. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల జాబితాకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గత పక్షం రోజులుగా అధికారులు ఇదిగో అదిగో అంటూ ఆన్‌లైన్ పేరిట ఆలస్యం చేస్తు వస్తున్నారు.



ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో ఇప్పటికే కొంతమంది లబ్ధిదారులు ఉన్న ఇంటి నిర్మాణాన్ని కూల్చి కొత్త ఇంటి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లో దాదాపుగా ప్రొసిడింగ్‌లు సిద్ధం కావడంతో ఎమ్మెల్యే ఇచ్చే సమయాన్ని బట్టి లబ్ధిదారులకు అందించే అవకాశం కనిపిస్తుంది. బోథ్ నియోజక వర్గంలో మరో రెండు మూడు రోజుల్లో ప్రొసిడింగ్‌లు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మాత్రం మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే ఒకటి రెండు రోజుల్లో ఎమ్మెల్యే ఇచ్చే జాబితాను క్షేత్ర స్థాయిలో వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. దీని తర్వాతనే ప్రొసిడింగ్‌లను లబ్ధిదారులకు అందించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఇప్పటి వరకు ప్రొసిడింగ్‌లను అందించేందుకు ముహూర్తం ఖరారు కాకపోవడంతో లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు.



అనువైన సమయం ఇదే..

ఇళ్ల నిర్మాణాలకు వేసవి కాలమే అనువైన సమయం అయినప్పటికీ అధికారుల్లో హడావుడి కనిపించడం లేదు. మరో పది రోజుల్లోనే తొలకరి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈనెల 25 నుంచి జిల్లాలో

(తరువాయి 6వ పేజీలో...)

'భూభారతి'తో రైతులకు మేలు : కలెక్టర్

జైనథ్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుపరుస్తున్న భూభారతి నూతన చట్టం రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజార్షిషా పేర్కొన్నారు. శుక్రవారం బోరజ్ మండలం బోరజ్ గ్రామంలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ప్రభుత్వం బోరజ్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిందన్నారు. అతేకాకుండా రాబోవు కాలంలో అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్‌కుమార్, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం : ఐటీడీఏ పీవో

ఉట్నూర్, మే 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి(పాటగుడా), నార్నూర్, సిర్పూర్(టి) (కాగజ్ నగర్)లోని తెలంగాణ ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం కోసం ఈనెల 24 వరకు సమీపంలో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠశాలలకు వెళ్లి సీబీఎస్ఈ సిలబస్ ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా పదో తరగతి పూర్తి చేసిన గిరిజన బాలబాలిక లు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హ్యూమానిటీ కోర్సులలో ప్రవే శం కోసం ఉట్నూర్ కొమురం భీం ప్రాంగణంలోని ఆదర్శ గురుకుల పాఠశాలలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

'విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలి'

భీంపూర్, మే 16(ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తప్పనిసరి తీసుకోవాలని భీంపూర్ తహసీల్దార్ నలంద ప్రియ అన్నారు. ఆమె మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ పీర్ సింగ్ నాయక్‌లతో కలిసి శుక్రవారం భీంపూర్‌లోని రైతు వేదికలో విత్తనాల, ఎరువుల డీలర్లతో అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ డీలర్ వద్ద అమ్మకం కొనుగోలు స్టాక్ రిజిస్టర్‌లు కొనుగోలు చేసిన ఇన్వాయిస్‌లు ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. అదేవిధంగా రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన వారికి తప్పకుండా బిల్లు ఇవ్వాలన్నారు. బిల్లులు ఇవ్వని డీలర్లపై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎన్జీవోలు నమోదు చేసుకోవాలి : జిల్లా అధికారి

ఉట్నూర్, మే 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు తమ పేర్లను 2025-26 గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోసం ప్రతీ పాదనల కోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 30వ తేదీలోగా విద్య, ఆరోగ్యానికి సంబంధం అయిన స్వచ్ఛంద సంస్థలు ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతీ ఒక్కరికి ఉంది

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతీ ఒక్కరికీ ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ రాములు నాయక్ కోడలికి మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించడం తప్పా?, గ్రూప్ వన్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై విద్యార్థులు రోడ్డెక్కితే స్పందించని ముఖ్యమంత్రి.. కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రశ్నించిన పాడి కౌశిక్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. కౌశిక్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పైనే అట్రాసిటీ కేసు పెట్టాలన్నారు. ఎన్నికల సమయంలో గిరిజనుల పట్ల రేవంత్ రెడ్డి చిన్నచూపు చూసారని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆరోపించారు. ఉన్నత విద్యానభ్యసించేందుకు విదేశాలకు వెళ్లిన గిరిజన యువకులు విదేశాల్లో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గిరిజన యువకులకు ఉన్నత చదువులకు వెళ్లి నేటికీ విదేశాల్లో రోడ్లపై తిరుగుతున్నారన్నారు. ఓవర్సీస్‌పై తానే స్వయంగా అసెంబ్లీలో రెండు సార్లు ప్రస్తావించినా ఇప్పటికీ స్పందన లేదన్నారు. తెలంగాణలో నేటికీ గిరిజన శాఖా మంత్రి ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రశ్నించిన పాడి కౌశిక్‌రెడ్డి పై అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకునేది లేదన్నారు.

రాజీవ్ యువ వికాసం పత్రాల పరిశీలన

బోథ్, మే 16(ఆంధ్రజ్యోతి): రాజీవ్ వికాసం పథకానికి వివిధ గ్రామాల నుంచి దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలు పరిశీలించారు. అయితే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లబ్ధిదారుల దరఖాస్తులను వివిధ బ్యాంకులు వారికి పంపించే ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఈవో అఖిల్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



బోథ్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, అధికారులు



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఉట్నూర్‌లో సజావుగా గురుకులాల ఇంటర్మీడియట్ కౌన్సిలింగ్

ఉట్నూర్, మే 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లోని 11 గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఉన్న బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రవేశ కౌన్సిలింగ్ సజావుగా జరిగింది. రీజినల్ కోఆర్డినేటర్ అగస్టీయన్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు హాజరయ్యారు. ఉట్నూర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాల, ఇంద్రవెల్లి మండలం ముత్నూరు, నేరేడు కొండ మండలం బుగ్గారం, ఆసిఫాబాద్ బాలికల ఆర్‌జేసీ, బాలికల అప్పర్ గ్రేడ్ ఆర్‌జేసీ, ఇచ్చోడ ఆర్‌జేసీ, యూఆర్‌జేసీ, జైనూర్ యూఆర్‌జేసీ, ముథోల్ యూఆర్‌జేసీ, తిర్యానీ యూఆర్‌జేసీ, సిర్పూర్(టి) యూఆర్‌జేసీల్లో మొదటి సంవత్సరం ప్రవేశం కోసం 731 సీట్లను భర్తీ చేస్తున్నామని ఆర్‌సీవో తెలిపారు. ఇది ఇలా ఉండగా ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు కౌన్సిలింగ్‌కు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులకు కావాల్సిన కనీస సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యారని తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పురక బాపురావు ఆరోపించారు.

30లోపే జొన్నల కొనుగోళ్లు పూర్తి

- ప్రారంభించిన పీఏసీఎస్ చైర్మన్

జైనథ్, మే 16 (ఆంధ్రజ్యోతి): మే 30వ తేదీ లోపే జొన్నలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మరిన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లకు చేపడుతున్నట్లు జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బోరజ్ మండలంలోని పిప్పర్‌వాడలో నూతనంగా ఏర్పాటు చేసిన జొన్నలకు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పంటను తీసుకువచ్చిన రైతును సన్మానించి, తూకం కాంటాలకు ప్రత్యేక పూజలు చేసి కొనుగోళ్లను చేపట్టారు. ఈ మేరకు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు క్లస్టర్లలో సుమారు 60వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే రెడ్‌గ్రామ్, బెంగాల్‌గ్రామ్ పంటను కొనుగోలు చేసి, రైతుల ఖాతాలో డబ్బులు వేయడం జరిగిందని గుర్తు చేశారు. కేంద్ర సంస్థ నాఫెడ్, రాష్ట్ర సంస్థ మార్క్‌ఫెడ్‌ల ద్వారా కొనుగోళ్లు చేపడుతున్నామని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. నూతన మండలాలు సాత్నాల, బోరజ్ మండలాల్లో మార్కెట్ కోసం మూడెకరాల చొప్పున స్థలాన్ని కేటాయించాలని, ఇప్పటికే కలెక్టర్‌ను కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఈఓ గంగన్న, ఏఎంసీ చైర్మన్ అశోక్ రెడ్డి, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



జొన్నల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న చైర్మన్ బాలూరి

డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా కేఆర్‌కే బస్తీ దవాఖానాలో అవగాహన కార్యక్రమం

ఆదిలాబాద్ టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే బస్తీ దవఖానాలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

- డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాథోడ్ ప్రతాప్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పిట్టబొంగురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవ గాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమల వల్ల వస్తుందని పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమలను నివారించవచ్చు అన్నారు. దోమల నివారణతో డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చున్నారు. ఇంటి చుట్టుప్రక్కల నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ భీంరావ్, హెల్త్ హెచ్‌ఈవో రాథోడ్ గోకుల్, హెల్త్ సూపర్ రాథోడ్ జలేందర్, విజయ్, ప్రియాంక, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సద్దాం ఆధ్వర్యంలో డెంగీ నివారణ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డెంగీ విస్తరణ, డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వారు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవీందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

భీంపూర్: దోమల వలనే డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతుందని భీంపూర్ మెడికల్ ఆఫీసర్ నిఖిల్ రాజ్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌లతో అవగాహన కల్పించారు. వారానికి ఒక్కసారైనా ఫ్రైడే డ్రైడే పాటించి దోమల నివారణ చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్, టెక్నీషియన్ విష్ణు, సూపర్ వైజర్ రోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.



పిట్టబొంగురంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రతాప్ నాయక్



నేరడిగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సద్దాం

రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్త పడాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు

ఆదిలాబాద్ అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు, ఇతర అంశాలపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వరి ధాన్య సేకరణ కేంద్రాలు లోతట్టు ప్రాంతాలలో ఉండకూడదని, వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు వరి ధాన్యం తడవకుండా జాగ్రత్త పడాలన్నారు. సంబంధిత సంస్థ అధికారులు వరి ధాన్య సేకరణ కేంద్రాలను సందర్శించి అక్కడ సరిపడా సౌకర్యాలు ఉన్నాయా లేదో నిర్ధారించాలని సూచించారు. జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ ద్వారా సరిపడా గన్ని సంచులు వరి ధాన్య సేకరణ కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ధాన్యం తరలించే సమయంలో అన్ని వైపుల నుంచి కప్పి, కాంట్రాక్టర్లు వరి ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లలో యాసంగి (2024-25) సంవత్సరానికి 467 మెట్రిక్ టన్నుల వరి పంట వస్తుందని అంచనా వేయడం జరిగిందన్నారు. రైతులకు మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300, అదనంగా బోనస్ రూ.500 సన్న రకం ధాన్యానికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 26 మంది రైతుల నుంచి 110 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, టార్పాలిన్, ప్యాడిక్లినరీ, గన్నీ బ్యాగులు తూకం యంత్రాలు, ఇతర సామగ్రిని సైతం అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లుకు తరలించడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజిద్‌అలీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రులు



వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

పూర్తయిన కవ్వాల్ పునరావాసం





కడెం మండలం మైసంపేట - రాంపూర్ గ్రామంలోని నూతనంగా నిర్మించిన ఇళ్లు ఇవే



నిర్మల్ జిల్లా మైసంపేట - రాంపూర్ గ్రామ ముఖద్వారం

● పునరావాస భూములపై నిర్వాసితులకు హక్కులు ● 276 ఎకరాలకు ఎలయనేబుల్ రైట్స్ ● త్వరలోనే జీడిమాది గ్రామం తరలింపునకు సన్నాహాలు



నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన పార్క్

నిర్మల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్ నిర్వాసితులకు సాగుకోసం కేటాయించిన భూములపై ప్రభుత్వం వారికి పూర్తి హక్కులు కల్పించడం పట్ల గిరిజనుల్లో హర్షం వ్యక్తమవుతోంది. టైగర్ జోన్ కోర్ ఏరియా నుంచి జిల్లాలోని కడెం మండలం మైసంపేట, రాంపూర్ గ్రామాల ప్రజలకు ఇదే మండలంలోని మద్దిపడగ గ్రామం వద్ద పునరావాసం కల్పించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇక్కడి పునరావాస గ్రామంలో నిర్వాసితులకు అధికారులు ఇళ్లు నిర్మించడమే కాకుండా మౌలిక సౌకర్యాలను కూడా కల్పించారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా కొంతమంది ఆర్థిక పరిహారాన్ని ఎంచుకోగా.. మరికొంత మంది భూ ఆధారిత పరిహారాన్ని ఎంచుకున్నారు. ఆర్థిక పరిహారం ఎంచుకున్న 48మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇప్పటికే ఆ పరిహారాన్ని అందించిది. కాగా భూ ఆధారిత పరిహారాన్ని ఎంచుకున్న94 మంది లబ్ధిదారులకు మద్దిపడగ గ్రామం వద్ద వారికి ఇళ్లు నిర్మించి పునరావాస కాలనీని ఏర్పాటు చేసింది. అలాగే 276.03 ఎకరాల భూములను సైతం ప్రభుత్వం కేటాయిస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. కాగా.. ఇక్కడి కాలనీలో రోడ్లతో పాటు ఇతర అన్ని మౌలిక సౌకర్యాలను కూడా కల్పించింది. కవ్వాల్ టైగర్ జోన్ నుంచి తరలించబడ్డ రాంపూర్, మైసంపేట గ్రామాల్లోని మొత్తం 142 మంది నిర్వాసితులకు గాను 94 మంది లబ్ధిదారులు మద్దిపడగ గ్రామంలోని పునరావాస కాలనీకి ఇప్పటికే తరలివచ్చి నివాసం ఉంటున్నారు.

● కేటాయించిన భూములపై సర్వ హక్కులు

కవ్వాల్ టైగర్‌జోన్ నిర్వాసితులైన 94 మందికి 276.03 ఎకరాల భూములను కేటాయిస్తూ ఇటీవలే రెవెన్యూశాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. పునరావాస ప్యాకేజీ ఒప్పందంలో భాగంగా నిర్వాసితులకు ఈ భూములను కేటాయించారు. కాగా.. నిర్వాసితులకు కేటాయించిన భూములు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న కారణంగా ప్రభుత్వం ఆ భూములను డీనోటిఫై కూడా చేసింది. ఇదిలా ఉండగా మొత్తం 276.03 ఎకరాలకు గాను కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్‌లో 243.24 ఎకరాలను 87 మంది లబ్ధిదారులకు కేటాయించగా.. మరో ఏడుగురికి పునరావాసం కల్పించిన మద్దిపడగ గ్రామంలోనే 32.19 ఎకరాలను కేటాయించారు. అయితే ఈ రెండు చోట్ల లబ్ధిదారులకు కేటాయించిన 276.03 ఎకరాల భూములకు ప్రభుత్వం ఎలయనేబుల్ హక్కులను కూడా కల్పించింది. ఈ హక్కులతో లబ్ధిదారులకు వారసత్వ హక్కులు లభించాయి. అంతే కాకుండా ఆ భూములను సాగు చేసుకోవడమే కాకుండా వాటిని అమ్ముకునేందుకు, బ్యాంకులో తాకట్టు పెట్టేందుకు, రుణాలు తీసుకునేందుకు కూడా హక్కులు లభించనున్నాయి.



భూములను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

● జీడిమాది గ్రామంపై నజర్

కవ్వాల్ టైగర్ జోన్ నుంచి అధికారులు ఇప్పటికే కడెం మండలంలోని రాంపూర్, మైసంపేట గ్రామాలను సురక్షిత ప్రాంతానికి తరలించగా.. మరో గ్రామాన్ని కూడా ఈ అడవిలో నుండి తరలించేందుకు అటవీ శాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. పెంబి మండలంలోని జీడిమాది గ్రామాన్ని టైగర్ జోన్ నుంచి తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే.. గ్రామాన్ని ఇక్కడి నుంచి పూర్తిస్థాయిలో తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు సమిష్టిగా రాంపూర్, మైసంపేట గ్రామాలను టైగర్ జోన్‌లోని కోర్ ఏరియా నుంచి ఎలాంటి ఆటంకాలు లేకుండా మద్దిపడగ గ్రామానికి తరలించారు. దీంతో ఇదే కోర్ ఏరియాలోని జీడిమాది గ్రామాన్ని కూడా సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



మస్కాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి

● నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్

ఖానాపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు దోపిడీకి పాల్పడుతుంటే ప్రభుత్వం వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉన్నప్పటికీ కనీసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోటోలు ఎక్కడ ఏర్పాటు చేయకపోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. 15 రోజుల్లో వర్షాలు మొదలయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నిర్మల్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేప ట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారతీయ జనతాపార్టీ ఆధ్వ ర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చ రించారు. ఈ వేర్వేరు కార్యక్రమాలలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆకుల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, బీజేపీ ఖానాపూర్ మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, పెంబి మండల అధ్యక్షులు ఐదు వెంకటేష్, కడెం మండల అధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్ యాదవ్, దస్తురాబాద్ మండల అధ్యక్షులు రాజు, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులున్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల అరెస్టుపై కేటీఆర్ ఆరా

నర్సాపూర్(జి), మే 16 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి అవగాహన సదస్సులో పాల్గొనేందుకు కుంటాల మండలానికి వచ్చిన మంత్రుల కాన్వాయ్‌లను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. మంత్రులు పొంగులేటి, సీతక్క కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వారిని పోలీసులు అరెస్ట్ చేసి నర్సాపూర్(జి) పోలీసుస్టేషన్‌కు తరలించారు. గ్రామీణ సీఐ కృష్ణ, కుబీర్ ఎస్సై రవీందర్, దిలావర్‌పూర్ ఎస్సై, నర్సాపూర్(జి) ఎస్సై సాయికిరణ్, సిబ్బంది కలిసిమాజీ జడ్పీ ఛైర్మన్ లోలం శ్యామ్ సుందర్, కొమురెవార్ కిరణ్‌కుమార్, పడగంటి దత్తాద్రి, పెంటార్ దశరథ్, రజినీకాంత్, నరేష్ కుమార్, రమేష్, నాకిడి లక్ష్మణ్, మహేష్, కృష్ణ శ్రీనివాస్, పోశెట్టి, వనిత, రవి, సాజన్‌కుమార్‌లను అరెస్ట్ చేసి సాయంత్రం వదిలిపెట్టారు.

మంత్రులకు స్వాగతం పలికిన నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు

కుంటాల, మే, 16 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క ఇతర అధికారులకు భైంసా హెలిప్యాడ్ వద్ద డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పూల మొక్కతో స్వాగతం పలికారు. రెవెన్యూ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీం రెడ్డి, సారంగాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్ అదీ, జడ్పీ కోఆప్షన్ సభ్యులు మహ్మద్, నాయకులు, తదితరులు ఉన్నారు.

మంత్రులకు స్వాగతం పలికిన ముథోల్ ఎమ్మెల్యే

కుంటాల, మే, 16 : (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం కుంటాల మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కలను ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ శాలువాతో సన్మానించి సరస్వతి అమ్మవారి చిత్రపటాన్ని అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.



పట్టుకున్న కలపతో అటవీ శాఖ అధికారులు

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
● రూ.25 వేల విలువ గల కలప స్వాధీనం

ఇచ్చోడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కలప రవాణా చేస్తున్నారన్న అనుమానంతో విచారణ చేపట్టగా అక్రమ కలప తరలిస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు ఎఫ్ఆర్‌వో పుండలిక్ తెలిపారు. ప్రయాణంలో 'తొందరతనం కారాదు ప్రమాదం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అటవీశాఖ అధికారులు శుక్రవారం స్పందించారు. మండలంలోని చించోలీ గ్రామానికి చెందిన పలువురిని విచారించి.. చించోలి గ్రామానికి చెందిన షేక్ మజార్ అనే వ్యక్తి అక్రమ కలప రవాణా చేశారని తెలుసుకున్నారు. ఆ తర్వాత అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమ టేకు కలప సైజ్‌ను గిర్నూర్ గ్రామానికి చెందిన గద్దె శ్రీనివాస్ అనే వడ్రంగికి అమ్మడానికి తీసుకువచ్చానని తెలిపారు. గిర్నూర్ గ్రామంలో రైట్ నిర్వహించి రూ.25 వేలు విలువైన అక్రమ టేకు కలపను, దానికి వాడిన ఒక బైక్‌ను జప్తు చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో డిప్యూటీ ఆర్ఓ ఇబ్రహీం షరీఫ్, భైరవి, నాశీలాల్ అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులకు ఆశ పడితే మోసమే : సీఐ

బోథ్, మే 16(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌ల ద్వారా డబ్బులు వస్తాయని ఆశపడితే అసలుకే మోసం జరుగుతుందని బోథ్ సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డబ్బుల ఆశలో పడి కొత్త యాప్స్ డౌన్లోడ్ చేసుకోవద్దన్నారు. రోజుకో రకంగా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల బోథ్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇలాంటి మోసంలో రూ.ఐదు లక్షల 92 వేలు పోగొట్టుకున్నారని అన్నారు. సైబర్ మోసా లకు గురైనవారు 1930 నెంబర్‌కు కాల్ చేయాలని వివరించారు. కాగా, సైబర్ క్రైమ్‌లో రూ.ఐదు లక్షల 92 వేలు మోసపోయిన వ్యక్తి 1930కు కాల్ చేయడం వల్ల విషయం బయటకు వచ్చిందని, ఈ విషయమై తాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ఆదిలాబాద్ టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదిలాబాద్ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని కొమురంభీం చౌరస్తా వద్ద సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను, నెంబర్ ప్లేట్ లేని వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.

'ఎంపీని పుష్కరాలకు ఆహ్వానించక పోవడం సరైంది కాదు'

ఆదిలాబాద్ అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల సందర్భంగా ఎంపీ వంశీకృష్ణను ఆహ్వానించక పోవడం సరైందికాదని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ కమిషనర్, ఈఓ అగ్రవర్ణ కులాలకు చెందిన వారైనందుననే ఆహ్వానించలేదని, వారిని సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు. అలాగే ఇన్‌చార్జీ మంత్రి శ్రీధర్‌బాబును మంత్రి వర్గం నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారి ఇళ్లను ముట్టడించి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

● ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ● మున్సిపాలిటీ భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ ● పట్టణంలో ఒకరి అరెస్టు



మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని కొట్టేయాలనే ప్రయత్నం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పట్టణంలోని నిందితుడు ఏ -2 అక్రమ్ భుక్తాపూర్‌లోని మున్సిపాలిటి ఖాళీ స్థలాన్ని అక్రమించాలని దురుద్దేశంతో తన బంధువైన సయ్యద్ షాబుద్దీన్‌పై అక్రమ దస్తావేజులు సృష్టించినట్లు తెలిపారు. మున్సిపాలిటి ద్వారా 35 సంవత్సరాలుగా నివసిస్తున్నాను అంటూ అక్రమపద్ధతిలో హౌజ్ నెంబర్‌ను తీసుకొని రిజిస్ట్రేషన్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ అధికారులు అతని పై ఫిర్యాదు చేయగా ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో అతని పై క్రైమ్ నెంబర్96/25తో అండర్ సెక్షన్329(3), 318(4),336(3), 340(2) బీఎన్ఎస్ సెక్షన్‌లతో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అక్రమ పద్ధతిలో నకిలీ దస్తావేజులు సృష్టించి మున్సిపాలిటి స్థలాన్ని కాజేయాలని దురుద్దేశంతో ఇలాంటి చర్యలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. భుక్తాపూర్‌లో గల 469.44 స్క్వేర్‌యాడ్స్ మున్సిపాలిటి స్థలంకు హౌజ్ నెంబర్ 6-6-36/2/1 కేటాయించడం జరిగిందని, మున్సిపాలిటి సిబ్బంది పాత్ర పై పూర్తి దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఒక వేళ మున్సిపాలిటి సిబ్బంది పాత్ర తేలినట్లయితే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. కాగా ఏ1 సయ్యద్ షాబుద్దీన్ తండ్రి మఖాన్ జి భుక్తాపూర్ (పరారీ), ఏ2 మహమ్మద్ అక్రమ్ తండ్రి ఇస్మాయిల్ భుక్తాపూర్ (అరెస్టు) వీరి పై ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇందులో ఆదిలాబాద్ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.సునిల్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలం బాట కబ్జా అవుతోందని.. రోడ్డును తవ్వించి రైతుల నిరసన

బోథ్, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్వార్టర్ ముందు నుంచి వెళుతున్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైతులు కబ్జా చేసి భవిష్యత్తులో పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందికరంగా మారుస్తున్నారని, ఆ రూట్లో పొలాలకు వెళ్లే రైతులు శుక్రవారం జేసీబీతో రోడ్డును తవ్వించి నిరసన వ్యక్తపరిచారు. తాము రానున్న రోజుల్లో పంటలు వేసేందుకు పొలాలకు వెళ్లాలంటే రోడ్డు వసతి లేదని, 33 ఫీట్లు ఉన్న రోడ్డును రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలువురు రైతులు కాలువ తీసి రోడ్డుపై వెళ్లకుండా చేయడం జరిగిందని సదరు రైతులు వాపోయారు. ఇరువురు రైతుల తీరువల్ల తాము పొలాలకు వెళ్లే దారి లేకుండా చేస్తున్నారన్నారని, అయితే స్థానిక సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎస్సై ప్రవీణ్, తహసీల్దార్ సుభాష్ చంద్రబోస్‌లకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది అన్నారు. అయితే రోడ్డును జేసీబీ ద్వారా అడ్డంగా తవ్వించి రైతులు రానున్న వర్షాకాలంలో తాము పంటలు వేయకుండా క్రాప్ హాలిడేను పాటిస్తామంటూ పేర్కొన్నారు. దీంతో స్థానిక తహసీల్దార్ పొలం బాటలకు ఆర్ఐ సునీత, ఎంసి బాపూరావులను పంపించి అక్కడి వాస్తవ పరిస్థితులు పరిశీలించాలని సూచించారు. దీంతో అధికారులు ఇరువైపులా ఉన్న రైతులతో పాటు ఆ రూట్లో వెళ్లే రైతులతో చర్చించారు. సమస్యను త్వరలోనే పరిష్కరించే విధంగా చూస్తామని రైతులకు వివరించడం జరిగింది.



బోథ్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ, మే 16(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం నేపథ్యంలో వివిధ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈఓ పవార్ రవీందర్ సూచించారు. శుక్రవారం నేరడిగొండలో పీహెచ్‌సీ వైద్యులు కలిసి డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఇళ్ల ఆవరణలో ఉన్న మురుగు నీటిని శుభ్రపరిచారు. ఇందులో హెల్త్ అసిస్టెంట్ సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, లలిత, ఉత్తమ్ సింగ్, ఆశాలు, తదితరులు ఉన్నారు.

'యువ వికాసం అందరికీ వర్తింపజేయాలి'

ఇంద్రవెల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అందరికీ వర్తింపజేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనక గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పథకంలో నిబంధనలను సడలించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన తుడుందెబ్బ నాయకులు

బోథ్, మే 16(ఆంధ్రజ్యోతి): లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ గతంలో ఉద్యమం చేసిన తుడుం దెబ్బ నాయకులు శుక్రవారం బోథ్ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం కోర్టు ముందు విలేకరుల సమస్యలను మాట్లాడుతూ తాము ఆదివాసులకు న్యాయం జరగాలని చేపట్టిన ఉద్యమంలో భాగంగా తమపై పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ తమ డిమాండ్ ఎస్టీ జాబితా నుండి లంబాడాలను తొలగించాలనేది ప్రధానమన్నారు. తాము చేపట్టిన డిమాండ్ ప్రభుత్వం పరిశీలించాల్సి న అవసరం ఉందన్నారు. కోర్టు కేసులో హాజరైన వారిలో తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు కడప నగేష్, జిల్లా నాయకులు రామేలి భోజన్న, భూమన్న, కూడాల స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి

ఖానాపూర్, మే 16(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం గంగాయిపేట్ శివారులోని ఇటుక బట్టీ వద్ద శుక్రవారం రాత్రి 11 గంటలకు దుర్ఘటన చోటు చేసుకుంది. ఇటుక బట్టీ వద్ద ట్రాక్టర్‌ను డ్రైవర్ రివర్స్ తీసే క్రమంలో మెస్రం స్వప్న (29) అనే మహిళ వాహనం కింద పడి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'ఇందిరమ్మ' ఇంకెప్పుడు?

(5వ పేజీ తరువాయి...)

ఖరీఫ్ పంటల సాగు పనులు ప్రారంభంకానున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా మారుతారు. ఇలాంటి పరిస్థితులతో ఇళ్ల నిర్మాణ పను లు ఆశించినంతగా ముందుకు సాగే అవకాశం ఉండదంటున్నారు. వర్షా కాల సీజన్ ముగిసేంత వరకు ఇందిరమ్మ ఇళ్ల జోలికి వెళ్లే పరిస్థితే ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తిరిగి దసరా పండుగ తర్వాత ఇళ్ల నిర్మాణ పనులను చేపడితే తీవ్రజాప్యం జరుగుతుంది. అలాగే వర్షాకాలంలో ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు కూడా భారీగా పెరుగుతాయి. అసలే చాలీచాలని నిధులతో ఇందిరమ్మ ఇంటిని నిర్మించడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అతేకాకుండా వర్షాకాలానికి ముందే బేస్మిట్ నిర్మాణ పనులను పూర్తి చేస్తే ఆ తర్వాత అడపదడప పనులను చేపట్టే అవకాశం ఉంటుంది.

తండ్రిని కొట్టి చంపిన కొడుకు

ఆదిలాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): తన తండ్రి తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని తండ్రిని కొట్టి చంపిన కేసులో కొడుకుకు ఐదేళ్ల పాటు కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానాను విధిస్తూ జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు శుక్రవారం తీర్పును వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ముదిగంపల్లి సురేష్ జూలై 25 2021న తాగుడికి డబ్బులు ఇవ్వలేదని తన తండ్రి అయిన ముదిగంపల్లి బొందియాలును రాయితో కొట్టి చంపిన ఘటనతో మావల పోలీసులు క్రైమ్ నెంబర్ 91/2021, యూ/సెక్షన్ 302 ఐపీసీ కింద కేసును నమోదు చేశారు.ఈ కేసులో 11 మంది సాక్షులను విచారణ జరిపిన అనంతరం న్యాయమూర్తి నిందితునికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షను విధించడం జరిగిందని కోర్టు లైజన్ అధికారి జి.పండరి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆదిలాబాద్ టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో డీఈఓగా పని చేస్తున్న రామ్మోహన్(రాజు) ఈనెల 4వ తేదీన మృతి చెందారు. వారి కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి బాగలేకపోవడంతో జిల్లా ట్రెజరీ రిటైర్డ్, ఉద్యోగుల తరపున రూ.లక్షా 700 ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీడీ అనంత్‌రావ్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ట్రెజరీ ప్రెసిడెంట్ చంద్రమోహన్ రెడ్డి, ఎస్‌టీఓఎస్ రమణాచారి, గంగాధర్, సతీష్ సింగ్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్లి(టి)లో ఎండు గంజాయి స్వాధీనం

భీంపూర్, మే 16(ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలంలో శుక్రవారం ఎక్సైజ్ సీఐ రెండ్ల విజేందర్, ఎస్ఐ వెంకటేశ్వర్ వైద్యల ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అర్లి(టి)కి చెందిన దొనకొండ అశోక్ వద్ద నలుగున్నర కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సుధా, తానాజీ, కానిస్టేబుల్ నానంగ్‌సింగ్, ధనరాజ్, హనుమంతు, లత, తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని వడ్గాం శివారులో నైతం ప్రభు కౌలు చేనులో భీంపూర్ పోలీసులు శుక్రవారం సాయంత్రం ఎనిమిది గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్ఐ పీర్‌సింగ్ తెలిపారు.



అర్లి(టి)లో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

● డీఎం పండరి ● ప్రయాణికులకు పువ్వులు, కీ చైన్లు అందజేత
● బస్టాండ్‌లో మర్యాద దినోత్సవం



ప్రయాణికులకు పువ్వులు, కీ చైన్ అందిస్తున్న డీఎం

నిర్మల్ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం సురక్షితం, సుఖవంతమని డిపో మేనేజర్ కే. పండరి అన్నారు. ప్రతీ నెల మూడో శుక్రవారం ఆర్టీసీ మర్యాద దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బస్టాండ్‌లో ప్రయాణికులకు డీఎం పువ్వులు అందిస్తూ బస్సులోకి ఆహ్వానించారు. ఒకవైపు లోగో మరోవైపు బార్ కోడ్ ఉన్న కీ చైన్ అందజేశారు. బార్ కోడ్ స్కాన్ చేస్తే ఆర్టీసీ అందించే పది రకాల సేవలు తెలియజేస్తామన్నారు. బస్సు బుకింగ్, గమ్యం, వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్ బుక్‌తో పాటు ఆర్టీసీ వెబ్‌సైట్ అందించే అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు వినియోగించుకొని ఆదరించాలని కోరారు. సహ మేనేజర్ రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ ఏఆర్ రెడ్డి డీఎం వెంట ఉన్నారు.

తల్లి చెంతకు జింక పిల్ల



జింక పిల్లతో మొయిజ్

నేరడిగొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాంకిడి ఘాట్‌లో గురువారం రాత్రి నిర్మల్ నుంచి వస్తున్న మొయిజ్ అనే వ్యక్తి జింక పిల్లను చూసి, సమీప ఫారెస్టు చెక్‌పోస్టులో అప్పగించారు. ఫారెస్ట్ అధికారులు నవజాత జింక పిల్లను గుర్తించి మొయిజ్‌తో కలిసి శుక్రవారం తల్లి జింకను అడవిలో కనుగొని పిల్లను అక్కడ వదిలారు. ఫారెస్టు అధికారులు మొయిజ్‌ను అభినందించారు.

భీంపూర్‌లో నవోదయపై ఆశలు

● ఇటీవలే స్థలాన్ని పరిశీలించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ● నవోదయ ఏర్పాటైతే ఆదివాసీ పిల్లలకు మేలు



భీంపూర్ శివారు ప్రాంతంలో నవోదయ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా (ఫైల్)



భీంపూర్ మండల కేంద్రం ముఖ చిత్రం

భీంపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించిన నవోదయ విద్యాలయం భీంపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తారని మండల వాసులు కోటి ఆశలతో ఉన్నారు. ఇటీవల ఏప్రిల్ 17న జిల్లా కలెక్టర్ రాజార్షిషా భీంపూర్ మండల కేంద్రానికి అనుకుని ఉన్న గుంజల శివారులో నవోదయ విద్యాలయం కోసం స్థలాన్ని కూడా పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు అయిన భీంపూర్ మండలం అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నందున నవోదయ విద్యాలయం ఏర్పాటు అయితే ఆదివాసీలు సహా అన్ని వర్గాల పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లల భవిష్యత్తు బాగుంటుందని స్థానికులు అంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న భీంపూర్ మండల కేంద్రంలో నవోదయ కోసం ఇక్కడ అవసరమైన వసతి సౌకర్యాలు ఉన్నాయి. మండలం మహారాష్ట్ర సరిహద్దుకు దగ్గర ఉన్నందున మారుమూల గుబిడి, కిజ్జన్‌గూడ, కిరణ్‌వాడి, రాజుల వాడి సహా మరెన్నో ఆదివాసీ గ్రామాలు లబ్ధి పొందే అవకాశం ఉంది. భీంపూర్ మండల కేంద్రంలో నవోదయ విద్యాలయ భవన నిర్మాణానికి కావాల్సిన స్థలం ఉంది కాబట్టి విద్యాలయం ఏర్పాటు చేయాలని అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

● నవోదయ భీంపూర్‌లో ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ ఇప్పటికే భీంపూర్‌లో నవోదయ విద్యాలయం కోసం స్థలం పరిశీలించడంతో మండల వాసుల అందరిలో ఆనందం నెలకొంది. అయితే విద్యాలయం కోసం అన్ని పార్టీలు కలిసి వచ్చి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలి. విద్యాలయం కోసం ప్రతీ గ్రామంలోని యువజన సంఘాలు కూడా ఒక్కటై ప్రభుత్వానికి విన్నవించాలి.

\- పెంట నితిన్, ఎంఎస్సీ
విద్యావంతుడు అంతర్గం, భీంపూర్

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోనే సాధ్యం

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివాసీలు, పేద ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటారు. వెనుకబడిన భీంపూర్ మండల కేంద్రంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు అనేది ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోనే సా ధ్యం అవుతుంది. ఆయన ఆదివాసీల కోసం ఎంతో చేశారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఆదివాసీలమంతా ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి విద్యాలయం ఏర్పాటు విషయంలో విజ్ఞప్తి చేస్తాం.

\- మడావి వినోద్, ఆదివాసీ
నాయకుడు, గుంజాల, భీంపూర్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి: ఎమ్మెల్యే బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



క్రీడాకారులతో ఎమ్మెల్యే, అధికారులు

ఉట్నూర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండి వాటిని చేరేందుకు ప్రవళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని కుమ్రం భీం ప్రాంగణంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో రాణించాలంటే అన్ని ఆటలను కాకుండా ఏదైనా ఒక ఆటనే ఎంచుకొని నిరంతర సాధనతో శ్రమిస్తేనే రాణించగలుగుతారన్నారు. క్రీడలు జీవితంలో పనికొచ్చే నాయకత్వ లక్షణాలు పోరాటపాటిమా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించడం, స్నేహభావం, ఆరోగ్యం ఇలాంటి ఎన్నెన్నో అంశాల్లో తోడ్పడతాయని అన్నారు. గిరిజన విద్యార్థులు ఆట పాటలతో పాటు చదువుపైన దృష్టి సారించాలని సూచించారు. క్రీడా పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరించినందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వపరంగా తన ఫౌండేషన్ తరపున క్రీడ పరికరాలు అందించడంతో పాటు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తానని అన్నారు. అనంతరం విద్యార్థులకు హార్టికల్చర్ శాఖ ద్వారా మామిడి పండ్లను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సేవలందించిన పీడీలు, కోచ్లను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేను ఘనం గా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీడీ జాదవ్ అంబాజీ, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, పీజీ హెచ్‌ఎంల రాష్ట్ర ఫోరమ్ అధ్యక్షుడు ఆత్రం భాస్కర్, జిల్లా గిరిజన క్రీడల అధికారి కో రెడ్డి పార్థ సారథి, శిబిరం ఇన్‌చార్జి ఉత్తం జాదవ్, మిశ్రమ గంగారాం, ఏటీడీఓ క్రాంతి కుమార్, పీడీలు జాదవ్ హేమంత్ నాయక్, శ్రీనివాస్, రవీందర్, జాదవ్ మధుసూదన్, విజయలక్ష్మి, కోచ్‌లు శివ కార్తీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో డీ హైడ్రేషన్.. తస్మాత్ జాగ్రత్త!

●డా.కాశీనాథ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, భైంసా



డా. కాశీనాథ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, భైంసా

భైంసా, మే 16 (ఆంధ్రజ్యోతి); వేసవి అంటే అందరికీ హడలే. ఎండ తీవ్రంగా ఉంటే ఇళ్లకే పరిమితం అవుతారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో అందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. భైంసాకు చెందిన ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డా. కాశీనాథ్ ఆయా సూచనలు ఇలా..

● ప్రస్తుతం గర్భిణుల్లో ఉమ్మ నీరు తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల డీ హైడ్రేషన్‌కు గురవుతారు. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

● సాధారణంగా గర్భిణుల్లో 100 కంటే ఎక్కువగా శరీర ఉష్ణోగ్రత నమోదైతే వడదెబ్బ తగిలినట్టు భావించాలి. వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.

● తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్నే తీసుకోవడం ఎంతో ఉత్తమం. ముఖ్యంగా వేపుళ్లను ఎక్కువగా తీసుకోవద్దు. చిప్స్‌తో పాటు చిరుతిళ్లకు దూరం పాటించాలి. టీ, కాఫీ, శీతలపానీయాల జోలికి వెళ్లకపోవడం మంచిది. నిత్యం 4 నుంచి 5 లీటర్ల నీటిని తీసుకోవాలి.

● కొబ్బరి బొండాల, మజ్జిగ, విటమిన్ సి ఎక్కువగా ఉండే పండ్ల రసాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. డీ హైడ్రేషన్ వల్ల చర్మం పగలడం, దురద పెట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. స్నానం చేయగానే శరీరానికి కొబ్బరి నూనె రాసుకుంటే ఈ సమస్య ఉండదు.


● ఈ మూడు నెలలు వదులైనా దుస్తులనే ధరించాలి. ఒక వేళ మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా గొడుగు ఉపయోగించాలి. వీలైతే శరీరానికి సన్ స్క్రీన్ లోషన్ వంటివి రాసుకోవాలి. తరుచూ దాహం వేయకుండా నీటి శాతం అధికంగా ఉండే పండ్లు తీసుకుంటే బాగుంటుంది.

కూరగాయల రైతులకు 'విక్రయ' పాట్లు



కూరగాయలను తింటున్న మూగజీవాలు


భైంసా, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన కూరగాయలను విక్రయించేందుకు గాను ఇక్కడి మార్కెట్లో రైతులు పాట్లు పడుతున్నారు. ప్రధానంగా మూగ జీవాల బెడదతో అవస్థల పాలవుతున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు మార్గంలో గల గాంధీ గంజ్ ఎదుట భాగంలో నిత్యం వేకువ జాము వేళలో రైతులకు కూరగాయలు తీసుకవచ్చి హోల్‌సెల్‌గా ఇక్కడి వ్యాపారులకు విక్రయిస్తుంటారు. అయితే అనువైన స్థలం లేకపోవడం మూలంగా కూరగాయల విక్రయాల సందర్భంలో మూగజీవాల బెడద అధికంగా ఉంటోంది. రైతులు తీసుకవచ్చిన కూరగాయల దిగుబడులు విక్రయం మార్కెట్లో పెట్టగానే మూగజీవాలు దూసుకవస్తూ వాటిని తింటున్నాయి. కొన్ని సందర్భాల్లో కూరగాయల బాక్స్‌లు మూగజీవాల దాటికి పడిపోతుండటంతో వాటిలోని దిగుబడులు నేల పాలవుతున్నాయి. మార్కెట్, మున్సిపల్ అధికార, పాలక వర్గాలు కూరగాయల రైతులకు విక్రయాల సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అడవి



దీపావళి పండుగ




ఇప్పపువ్వును తీసుకెళ్తున్న గిరిజన మహిళా చిత్రం

ఫొటో న్యూస్

చిత్రకళలో..
గిరిజన యువకుడి నైపుణ్యం

ఆయన కుంచె పడితే ఎలాంటి చిత్రాన్నైనా అవలీలగా వేసేస్తాడు. తన చిత్రాలతో గిరిజన సాంప్రదాయాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాడు. గుడి హత్నూర్ మండలం తోషం పంచాయతీ పరిధిలోని సోయంగూడకు చెందిన మేస్రం రాము. గిరిజన సాంప్రదాయ పద్ధతులు, వాయిద్య పరికరాలు, పెండ్లి పత్రికలు, వారి జీవన విధానం ఉట్టిపడేలా కనిపించే చిత్రాలను గీస్తూ ఔరా అనిపిస్తున్నాడు. గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెబుతున్నాడు.

●(ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)




గిరిజన సాంప్రదాయ పెళ్లి చిత్రపటం





చెట్లపై పక్షులు





గిరిజన సాంప్రదాయ పండుగలు

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.6 ; కనిష్ఠం 26.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 17 మే 2025





సమస్యలపై ఏకరువు

- జిల్లా పర్యటనలో మంత్రి పొంగులేటి, సీతక్కకు నేతల వినతుల వెల్లువ
- అటవీ అనుమతులపై ఎమ్మెల్యే వెడ్మబొజ్జు వినతి
- కంజర భూముల నిషేధంపై డీసీసీ చీఫ్ శ్రీహరిరావు..
- 'గుండెగావ్' సమస్యను పరిష్కరించాలన్న కేంద్ర మాజీ మంత్రి చారి
- ఎస్సారెస్పీ ముంపు భూములు, హైలెవల్ కెనాల్ పునరావాస భూములపై మాజీ ఎమ్మెల్యేలు
- సమస్యలపై స్పందించిన మంత్రి పొంగులేటి
- త్వరలోనే అన్నీ పరిష్కరిస్తానని హామీ

నిర్మల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ పార్టీ హయాంలో అప్పటి సర్కారు నిర్లక్ష్యానికి గురైన దీర్ఘకాలిక సమస్యలపై ప్రస్తుత అధికార పార్టీ నేతలంతా సామూహికంగా గళమెత్తడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్ర కేబినెట్‌లో కీలకమంత్రిగా వ్యవహరిస్తూ రెవెన్యూశాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న పొంగులేటి శ్రీనివాస్ దృష్టికి జిల్లాలోని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలంతా తమ తమ నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ సమస్యలను విన్నవించి ఆ సమస్యలను పరిష్కరించాలని బహిరంగంగా కోరడం ఆసక్తిని రేకెత్తించింది. గురువారం జిల్లాలోని కుంటాల మండల కేంద్రంలో జరిగిన భూభారతి సదస్సుకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అలాగే రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్‌లు హాజరయ్యారు. ఈ సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారిలతో పాటు తదితరులు హాజరయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ధరణిని పక్కన పెట్టి భూ భారతి పోర్టల్‌ను అమలు చేసేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇక్కడి అధికార పార్టీ నేతలంతా భూములకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలనే లక్ష్యంగా చేసుకుంటూ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అయితే జిల్లా నేతలు తన దృష్టికి తీసుకు వచ్చిన భూముల సమస్యలన్నింటిపై మంత్రి పొంగులేటి అక్కడికక్కడే స్పందించి సమస్యలను పరిష్కరిస్తానంటూ భరోసా కల్పించడం పట్ల అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తన వెంటే ఉన్న రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో మంత్రి మాట్లాడి సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలంటూ ఆదేశించడం గమనార్హం.

అటవీ అనుమతులపై వెడ్మబొజ్జు..

కాగా ఖానాపూర్ నియోజకవర్గంలో ఏళ్ల నుంచి పరిష్కారానికి నోచుకోని అటవీ అనుమతుల వ్యవహారంపై అధికార పార్టీ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు మంత్రి సమక్షంలో గళమెత్తారు. అటవీశాఖ అనుమతులు లభించకపోవడంతో ఖానాపూర్ నియోజకవర్గంలోని అనేక మారుమూల గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యం కావడం లేదంటూ ఆయన మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణంతో పాటు కరెంటు సౌకర్యం కూడా కల్పించలేని పరిస్థితి ఉందని బొజ్జు మంత్రికి వివరించారు. ఇప్పటికి కరెంటు సౌకర్యం లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయని ఆ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పిద్దామంటే అటవీశాఖ అనుమతులు లభించడం లేదంటూ ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పోడు సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చిన నేపథ్యంలో ఈ విషయంపై కూడా దృష్టి సారించాలని ఆయన కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అటవీశాఖ సమస్యలపై తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అవసరమైతే సీఎంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తే గిరిజనులంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని ఎమ్మెల్యే బొజ్జు మంత్రికి వివరించారు.

కంజర నిషేధిత భూములపై శ్రీహరిరావు..

కాగా లక్ష్మణచాంద మండలం కంజర పునరావాస గ్రామంలోని భూములపై ఏళ్ల నుంచి నిషేధం కొనసాగుతున్నందున అక్కడి నిర్వాసితులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వివరించారు. ఈ గ్రామంలో దాదాపు వెయ్యి మంది జనాభా ఉంటున్నారని పునరావాసం సందర్భంగా వీరికి కేటాయించిన భూములపై నిషేధం కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నిషేదాన్ని ఎత్తివేయాలంటూ గ్రామ ప్రజలతో పాటు స్థానిక నాయకులు ఏళ్ల నుంచి కోరుతున్నప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వెంటనే ఈ భూములపై నిషేధం ఎత్తి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే భూములపై నిషేదం కారణంగా గ్రామస్థులు ఈ భూములను తమ అవసరాల రీత్యా అమ్ముకునే అవకాశం కోల్పోతున్నారని దీంతో పాటు వారికి ఇతర ప్ర యోజనాలు కూడా దక్కడం లేదన్నారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి భూములపై నిషేదం ఎత్తివేయాలని రెవెన్యూశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌ను వేదికపైనే ఆదేశించారు.

గుండెగావ్ గోస పట్టించుకోవాలి..

కాగా మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి సైతం ముథోల్ నియోజకవర్గంలోని పలు సమస్యలను రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. ముఖ్యంగా గుండెగావ్ పునరావాస సమస్యను వేణుగోపాలచారి వివరించారు. గుండెగావ్ గ్రామస్థులకు ఇప్పటి వరకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించకపోవడంతో ప్రతీఏటా వారంతా వర్షకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చారి పేర్కొన్నారు. వర్షాలు పడితే వీరందరిని భైంసాలోని షెల్టర్‌జోన్‌లకు తరలించడం పరిపాటిగా మారిందని అన్నారు. వెంటనే గుండెగావ్ గ్రామానికి పునరావాస ప్యాకేజీని అమలు చేసి అక్కడి ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు.

సమస్యలపై మాజీల ఏకరువు

ఇదిలా ఉండగా ముథోల్ నియోజకవర్గంలోని పునరావాస గ్రామాల సమస్యలపై మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్‌లు మంత్రి పొంగులేటికి వివరించారు. ఎస్సారెస్పీ పునరావాసం, హైలెవల్ కాలువల భూసేకరణ, పరిహారం చెల్లింపు లాంటి సమస్యలను పొంగులేటి ముంగిట ఉంచారు. కాగా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు వివరించిన సమస్యలపై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించి ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానంటూ హామీనివ్వడం ఇటు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లోనూ బాధిత గ్రామ ప్రజల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థం



యజ్ఞంలో పూర్ణాహుతులను సమర్పిస్తున్న ఆలయ అనువంశిక యజ్ఞాచార్యులు

దిలావర్‌పూర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : కాల్వ అడవుల్లో కొలువైన భక్తజనబాంధవుడు కాల్వ లక్ష్మీ నరసింహస్వామి చక్రతీర్థం (అవబృతము, నాగవెల్లి స్నానాలు) శుక్రవారం సాయంత్రం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని స్వామి వారి పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. పుష్కరిణిలో స్వామివారికి నాగవెల్లి స్నానాలు చేయించారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా దేవస్థానానికి తీసుకు వచ్చారు. అంతకుముందు నిత్యార్చన,శేష హోమము, పూర్ణాహుతి, బలిహరణం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మహేందర్, పాలకవర్గం సభ్యులు, భక్తులు, అధికారులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి దేవాలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ



మాట్లాడుతున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

సోన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శుక్రవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. వేద పండితులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తానూ దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ఆలయ నిర్మాణానికి 25 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆలయాలను దేవాదాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం ఐకే రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, గంగారెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ రమేష్, పాకాల రామచందర్, శ్రీకాంత్ యాదవ్, వినయ్, రమేష్, రవి, గ్రామ ప్రజలు, టెంపుల్ మెంబర్స్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : నేడు (శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని శుక్ర వారం పత్రిక ప్రకటనలో విద్యుత్‌శాఖ అధికారులు తెలి పారు. పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ సబ్‌స్టేషన్‌లో వేసవి కాలం మరమ్మతుల కారణంగా అగ్రికల్చర్ మార్కెట్ ఏరి యా, మోచిగల్లి, బుధవార్‌పేట్, గాంధీచౌక్, కబూతర్ కమా న్, బంగల్‌పేట్, నాయుడువాడ, బోయవాడ, రామ్‌రావ్ బాగ్, సాయి బాబా టెంపుల్ ఏరియా, విశ్వనాథ్‌పేట్, వైఎస్ఆర్ కాలనీ, గాజులపేట్, డాక్టర్స్ లైన్ తదితర ప్రాం తాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మంత్రి పర్యటనను అడ్డుకునేందుకు

యత్నించిన బీఆర్ఎస్ నేతల అరెస్టు





కుంటాలలో మంత్రి పర్యటనను అడ్డుకునేందుకు యత్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కుంటాల, మే, 16 : (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం కుంటాల మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన రెవెన్యూశాఖ మంత్రి పొంగులే టి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు యత్నించారు. మండల కేంద్రం కుంటాల స్థానిక మున్నూరుకాపు సంఘం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి భైంసా వరకు హెలిక్యాప్టర్‌లో వచ్చారు. అనంతరం భైంసా నుంచి ప్రత్యేకవాహనంలో కుంటాలకు రాగా ఫంక్షన్ హాల్‌లోకి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లోలం శ్యాం సుందర్, కిరణ్ కొమ్రేవార్, పడకంటి దత్తు, దశరథ్, రజనీకాంత్‌తో పాటు పలువురు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు వెంటనే వారిని అడ్డుకొని ప్రత్యేక వాహనంలో నర్సాపూర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

దరఖాస్తు ఇచ్చేందుకు

వెళ్లిన వారిని అడ్డుకున్న పోలీసులు



డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నర్సాపూర్(జి), మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి గురువారం దరఖాస్తు ఇవ్వడానికి పేద ప్రజలు వెళ్లారు. అధికారులు కుంటాల మండలంలోని భూ భారతి సదస్సుకు వెళ్లడంతో మహిళలు కలెక్టర్, మంత్రులకు వినతిపత్రం అందజేయాలని కుంటాలకు వాహనాల్లో బయలుదేరారు. కుంటాల వెళ్లేందుకు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న మహిళలను కల్లూర్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో తిరిగి మండల కేంద్రానికి చేరుకున్నారు. సాయంత్రం పేద మహిళలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొండాజి శ్రావణ్‌కు సన్మానం

నిర్మల్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ నూతనంగా ఎన్నికైన పట్టణ ప్రధాన కార్యదర్శి కొండాజి శ్రావణ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, జిల్లాలోని మండల అధ్యక్షులు సాయినాథ్, కాశవేణి శ్రీనివాస్, నవీన్, బీజేపీ సీనియర్ నాయకులు తాలోడ్ శ్రీనివాస్, యోగేష్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ శిశు మందిరాలు.. సంస్కృతికి నిలయాలు

- విద్యారణ్య భారతి మహాస్వామి



ప్రారంభ మహోత్సవ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యారణ్య భారతి మహాస్వామి



ప్రారంభ మహోత్సవ సమావేశంలో విద్యారణ్య భారతి మహాస్వామి అనుగ్రహభాషణం

భైంసా, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి లోకానికి నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తూ వారిని అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్న సరస్వతీ శిశు మందిరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలుగా విరాజిల్లుతున్నాయని కర్ణాటక రాష్ట్రంలోని హంపి విరూపాక్ష పీఠం పరమహంస పరివ్రాజకాచార్య విద్యారణ్య భారతి మహాస్వామి అన్నారు. శుక్రవారం భైంసాలోని ఏపీ నగర్ కాలనీ పరిధిలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ ప్రాథమిక పాఠశాల ప్రారంభ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సదాచారం, దేశభక్తి,దైవభక్తి, ధర్మనిష్ఠ, సంస్కారంతో కూడిన విద్యను అందించడం ఒక్క శిశుమందిర్ విద్యా సంస్థలలో కొనసాగుతోందన్నారు. ఇదే క్రమంలో సనాతనమైన సంస్కృతి, సంప్రదాయాలు, అచార వ్యవహారాలపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తూ వారు సన్మార్గంలో పయనిస్తూ సత్ఫలితాలు సాధించి ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు శిశు మందిరాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు..అధునిక పోకడలతో, పాశ్చత్యదోరణి విధానాలతో అన్ని రంగాల్లో విష సంస్కృతి రాజ్యమేలుతోందన్నారు. ఇందుకు పూర్తి స్థాయి భిన్నంగా శిశు మందిరాల్లో సంప్రదాయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ నైతిక విలువలకు అద్దం పట్టేలా నిర్వాహణ వ్యవస్థ కొనసాగుతోందన్నారు. ఇంతటి విశిష్టమైన సరస్వతీ శిశు మందిర్ విద్యా సంస్థల అభ్యున్నతికి, ప్రగతికి ప్రభుత్వంతో పాటు ప్రతి ఒకరు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలని సూచించారు. నిర్వాహణ వ్యవస్థకు తోడ్పాటునివ్వడం బాధ్యతగా భావించాలన్నారు.. సమాజంలోని ప్రతి ఒకరు ఆధ్యాత్మిక భావాలతో వ్యవహరిస్తూ ప్రతి నిత్యం ఆలయాల సందర్శన చేపట్టాలన్నారు. ఆపద సమయంలో కాకుండా అన్ని వేళల ఆలయాలకు వెళ్లాలని సూచించారు. భక్తి మార్గమే జీవితానికి ముక్తి మార్గమన్నారు. మాతృమూర్తులందరూ సనాతనమైన అచార, వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకుంటూ తమ తమ పిల్లలకు మార్గదర్శకమైన బాటను వేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యారణ్య భారతి మహా స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి శిశు మందిర్ పాఠశాల ప్రారంభ మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఇందులో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, శ్రీ సరస్వతీ విద్యా పీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రతినిధి సాధుల కృష్ణదాస్, రామకృష్ణ సేవా సమితి ప్రతినిధి శైలేష్ మహాశెట్టివార్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చందులాల్, ప్రతినిధి చొండి రాజేశ్వర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రతీ ధాన్యపు గింజ కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రితో మాట్లాడుతున్న కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నిర్మల్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతిధాన్యంపు గింజ కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎలంటి అవాంతరాలు తలెత్తకుండా సజావుగా సాగుతోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. హైదరాబాద్ నుండి శుక్రవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుతో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లాల వారీగా కొనుగోలు చేసిన ధాన్యం, అంచనాల వివరాలను కలెక్టర్లతో సమీక్షించారు. రైతుల నుంచి వరి ధాన్యాన్ని సమర్థవంతంగా కొనుగోలు చేసి, వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అధికంగా తూకం వేయకూడదని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో కొనుగోలు చేసిన వరి ధాన్యం వివరాలను, ఇంకా కొనుగోలు చేయాల్సిన అంచనాలు వెల్లడించారు. కొనుగోలు వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... కొనుగోలు ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని, ట్యాబ్‌ల ద్వారా రోజువారీగా కొనుగోలు వివరాలు నమోదు చేయాలని సూచించారు. రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని, తేమ పేరుతో రైతుల నుండి అధికంగా ధాన్యం సేకరిస్తే సంబంధిత కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే 60 శాత ధాన్యం సేకరణ పూర్తి అయ్యిందని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ప్రతి ధాన్యపు గింజలు కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో, ఇంచార్జ్ డీఎస్‌వో కోమల్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం సుధాకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రానున్న

రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి

నిర్మల్ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి (విపత్తు నివారణ) అరవింద్ కుమార్ శనివారం జిల్లాకు రానున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. శుక్రవారం ఆయన పర్యటన వివరాలు విడుదల చేశారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఆయన మధ్యాహ్నం 12 గంటలకు నిర్మల్ చేరుకోనున్నారు. ప్రకృతి విపత్తు నివారణలో భాగంగా కలెక్టర్, ఎన్‌డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండర్‌తో కలిసి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించనున్నారు. మధ్యాహ్న భోజనం ముగించుకొని 2 గంటలకు ఉట్నూర్, ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించ నున్నారు. సాయంత్రం 5:30 గంటలకు అక్కడ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, తిరిగి హైదరాబాద్ బయలుదేరి వెళ్లనున్నారు.

దళితులపై దాడి అమానుషం



కుంటాలలో విలేకరులతో మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

కుంటాల, మే, 16 : (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12 న ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో బుద్ధ పౌర్ణిమ సందర్భంగా ప్రశాంతంగా పూజలు నిర్వహిస్తున్న సమయంలో దళితులపై గ్రామానికి చెందిన వంద మంది కర్రలతో అమానుషంగా దాడి చేసి గాయపరచడం సమంజసం కాదని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మగ్గిడి దిగంబర్, న్యాయవాదులు దేవిదాస్ హెగ్డే, చంద్రే అశోక్, గంగాధర్‌లు పేర్కొన్నారు. కుంటాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇలాంటి దాడి ఘటనలు మరోమారు పునరావృతం కాకుండా చూడాలని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజారాం, లక్ష్మణ్, పలువురు దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

- మండల విద్యాధికారి రమణారెడ్డి



ఆష్టా పాఠశాలలో విద్యార్థులు, ఎంఈవో, పోషకులు

ముథోల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి రమణారెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బడి బాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు పోషకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా బడిలో చేర్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేర్పించడం వల్ల నాణ్యమై విద్యతో పాటు నాణ్యమైన భోజనం, ఉచిత పుస్తకాలు, సమదుస్తులు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు, తదితరులు పాల్గొన్నారు.